“ఒండర్‌ఫుల్‌గా నటించావ్ సురేష్ ! మిగిలిన జీవితమంతా నీతో గడపటం నిజంగా నా అదృష్టంగా భావిస్తాను” చెవిలో రహస్యంగా చెపుతోంది.

మళ్ళీ భయం... ఆమె కౌగిలి మృత్యువు కబంధ హస్తంలాగుంది. ఆమె కళ్ళు...ఆమె పెదాలు....ఆమె జుట్టు... అన్నీ వికృతంగా కనిపిస్తున్నాయి యిప్పుడు! తన పెదాలను తాకుతున్న ఆమె పెదాలు ఏ క్షణాన్నయిన తన శరీరంలో నుంచి రక్తం పీల్చేసేట్లు కనబడుతున్నాయి.

“చాలా టెన్షన్ ఫీలవుతున్నట్లున్నావ్! విశ్రాంతి తీసుకో” మరోసారి ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయిందామె.

రెండు రోజులు గదిలోనే ఖైదీలా గడపాల్సి వచ్చింది. రెండు రోజులూ మాధురి కూడా కన్పించలేదు. మాధురి... సహదేవ్ కల్పన దేహాన్ని పోస్ట్‌మార్టం నుండి తెచ్చే ప్రయత్నంలో తీరిక లేకుండా వున్నారు.

మూడో రోజు ఉదయమే విష్ణు వచ్చాడు.

“త్వరగా రడీ అవ్....స్మశానానికెళ్ళాలి....” అన్నాడు చిరునవ్వుతో.

“నేనెందుకు?”

“అర్జున్ చాలా బిజీగా వున్నాడు. రెండు రోజులవరకూ బాంబేనుంచి రావటం కుదరదు. కనుక నువ్వు వెళ్ళక తప్పదు”

మరో రెండు గంటల్లో స్మశానం చేరుకున్నారందరూ.

చితి మీద కల్పన దేహం కాలిపోతోంది.

కళ్ళు మూసుకుని ఆమె ఆత్మశాంతి కోసం ప్రార్దించాడు సురేష్ .

“సారీ కల్పనా! నీకేమీ సహాయం చేయలేకపోయాను” అనుకున్నాడు లోలోపల. “నాకు నేను కూడా సహాయం చేసుకోగలనో లేదో తెలీటంలేదు.”

మాధురి తన పక్కనే నిలబడి వుంది .

సహదేవ్, విష్ణు, నలుగురు సెక్యూరిటీ గార్డ్‌లు, మాధురీ ఇండస్ట్రీస్ సిబ్బంది...చాలామంది వచ్చారక్కడికి.

కార్యక్రమం పూర్తయ్యేసరికి మధ్యాహ్నాం పన్నెండయిపోయింది.

ఎ.సి. కారులో ఇంటికి బయల్దేరాడు సురేష్.

మాధురి అతని మీదకు వంగి మాట్లాడ్తోంది రహస్యంగా.

“ఇంక మనం అదివరకు అనుకున్న కార్యక్రమం ప్రారంభించే టైమ్ వచ్చింది సురేష్ !”

అతను తృళ్ళిపడ్డాడు... ఏమిటా కార్యక్రమం? తను నిజంగా అర్జున్ అయ్యే కార్యక్రమమేనా? అంటే.....? అంటే అర్జున్‌ని చంపేయటమేనా?

కారు ఇంటికి చేరుకుంది.

"రాత్రికి అన్నీ మాట్లాడదాం" లిఫ్ట్‌లో అందామె.

తన గదిలోకి నడిచి సోఫాలో కూలబడిపోయాడతను. ఆలోచిస్తున్న కొద్దీ చెమటలు పడుతున్నాయి.

"మనం అనుకున్న కార్యక్రమం ప్రారంభించే టైమ్ వచ్చింది."

అంటే అర్జున్ ప్రమాదావశాత్తూ చనిపోతాడా? ఆ తర్వాత తననెంత కాలం వుంచుతారు?

రాత్రి ఆమె కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడతను. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటం లేదు. కుర్చీలో కునికిపాట్లు పడుతూండగానే తెల్లవారుజామున నాలుగయిపోయింది. ఉలిక్కిపడి కుర్చీలో నుండి లేచి నిలబడ్డాడు.

"నన్నూ, నిన్నూ యిద్దర్నీ చంపేస్తారు" అని ఎవరో అంటున్నట్టు విన్పించింది.

మాధురి రాకపోయేసరికి ఏదో భయం ప్రారంభమైంది. క్షణక్షణం ఈ భయంతో, ఈ టెన్షన్‌తో గడపటం దుర్భరంగా వుంది.

ఏమైనా సరే...పూర్తిగా పరిస్థితి చేయి జారకముందే తనిక్కడి నుండి పారిపోవాలి. అంటే ఇప్పుడే ఆ ప్రయత్నం చేయాలి. అందరూ రాత్రంతా చాలా జాగ్రత్తగా మేల్కొని నిద్రలోకి జారే సమయం యిది. కొంచెం రిలాక్స్ అయ్యే ఘడియలివి.

బయటి తలుపు బోల్ట్‌ని నెమ్మదిగా శబ్దం కాకుండా తీసి తలుపులు తెరవటానికి ప్రయత్నించాడు. బయట బోల్ట్ వేసినట్లుంది. కదలటం లేదు. విష్ణు తలుపు పక్కనే గురక పెట్టటం అస్పష్టంగా వినబడుతోంది. తన మీద పూర్తి నమ్మకం ఏర్పడింది అందరికీ. అందుకే కొంచెం అప్రమత్తత సడలింది.

మాధురి గదివేపు తలుపులు తోశాడతను. నిశ్శబ్దంగా తెరుచుకుంది. లోపల మంచం మీద ఆదమరచి నిద్రపోతోందామె. పంజరంలో చిలక సన్నగొంతుతో "ఎవరు?" అంది.

అతను ఆమె మంచం దగ్గరకు నడిచాడు. ఆమె గాఢనిద్రలో వున్నట్లు అర్థమవుతోంది. బోల్ట్ తీసి బయటి తలుపు కొంచెంగా తెరిచి నడవాలోకొచ్చాడు. డిమ్‌లైట్ వెలుగుతోంది.

నడవా చివరి వరకూ ఎవరూ కన్పించలేదు.

త్వరత్వరగా నడిచాడతను, లిఫ్ట్ పక్కనే మెట్లు కనబడుతున్నాయి. ఆ మెట్లన్నీ దిగితే కుడివేపున మూడు గారేజ్‌లుంటాయి. మూడో గారేజ్‌కి తలుపులుండవు. అందులో దూరి కారు స్టార్ట్ చేసుకుని గేటువేపు దూసుకుపోవాలి. బహుశా రెండు వందల మీటర్ల దూరంలో వుంటాయి గేట్లు.

ఈలోగా వీలయినంత వేగం పెంచుకుని వెళ్ళి గేట్ల తో ఢీకొనాలి. ఆ వేగానికి గేట్లను కలిపి వుంచే రాడ్ వంగిపోవటమో విరిగిపోవటమో జరిగి గేట్ తెరచుకుంటుంది. సెక్యూరిటీ గార్డ్‌లు ఈ హటాత్సంఘటనకు షాక్ తిని చూస్తుంటారు. ఆ తాకిడికి కారు చెడిపోతే తను

డోర్ తెరుచుకుని కిందకు దూకి చీకట్లో కలిసిపోతాడు.
అదృష్టవశాత్తూ కారు నడిస్తే యింక బ్రహ్మదేవుడిక్కూడా దొరకడు. చార్మినార్ ఏరియాలో కెళ్ళి యిరుకుసందుల్లో ఎక్కడో కారు వదిలేసి పారిపోవటమే. తననెవరూ కనుక్కోలేరా సందుల్లో.

చకచకా మెట్లు దిగసాగాడు. మూడో అంతస్తులో మెట్ల పక్కనే గార్డ్ గోడకానుకుని నిద్రపోతున్నాడు. తనను ఎవరయినా చూసినా ఫరవలేదు. ఎందుకంటే తనను అర్జున్ అనుకుంటారు. అయిదు నిమిషాలు పట్టింది మెట్లన్నీ దిగేసరికి. చెమటలు కారిపోతున్నాయ్ అడుగులు తడబడుతున్నాయ్. ఎక్కడా ఎవరూ కనిపించటం లేదు. ఆఖరి మెట్టు దిగుతూ దూరంగా వున్న గేటువేపు చూశాడతను. గార్డ్ నలుగురూ దీపం కాంతిలో కనబడుతూనే వున్నారు. గారేజ్ వేపు వడివడిగా నడిచాడతను. మూడో గారేజ్‌లోకి నడిచి జాగ్రత్తగా శబ్దం కాకుండా డోర్ తెరిచాడు. స్టీరింగ్ ముందు కూర్చున్నాక తెలిసిందతనికి.

ఇగ్నీషన్ కీస్ లేవు దానికి. నిరాశతో కృంగిపోయాడు సురేష్ . తన ప్లానంతా సర్వనాశనం అయిపోయింది.

బానెట్ తెరచి ఇగ్నీషన్ వైర్స్ వెతికి కనెక్ట్ చేస్తే స్టార్ట్ అవుతుంది గానీ తనకంత పరిజ్ఞానం లేదు. అయినా ప్రయత్నించాలి!

లేచి కారు ముందుకొచ్చి బానెట్ పైకి లేపాడు. పది నిమిషాలు ఆ చీకట్లో కెలికాడు గానీ ఏమీ తెలీటం లేదు. వళ్ళంతా భయంతో చెమటలు పట్టేసి తడిసి పోయింది. గారేజ్ బయటికొచ్చి నీరసంగా నిలబడ్డాడు. అప్పుడు పడింది అతని భుజం మీద ఓ చేయి. అదిరిపోయి వెనక్కు తిరిగి చూశాడు. విష్ణు! కౄరమయిన నవ్వు వెలిగిపోతోందని ముఖంలో
"ని.......ని........నిద్ర పట్టక ......ఇలా ......." అన్నాడు సురేష్ తడబడుతూ.

అతను గట్టిగా నవ్వాడు. "నాకు అంతే! నిద్ర పట్టదు. పద గదికెళ్దాం!"

తిరిగి తొమ్మిదవుతుండగా మెలకువ వచ్చింది.

విష్ణు ముఖం ఎదురుగ్గా కనిపించింది.

"కమాన్ మాన్! గెటప్ త్వరగా ఆఫీస్‌కెళ్ళాలి మనం"

సురేష్ లేచి కూర్చున్నాడు.

"త్వరగా రడీ అవ్వు. బాస్ ఫోన్ చేశారిప్పుడే"

సురేష్ బాత్ రూమ్‌లోకి పరుగెత్తాడు. రాత్రి జరిగిందంతా కలలా అనిపిస్తోంది. విష్ణు తనను ఎలా కనుక్కోగలిగాడు? తను నిద్ర పట్టక అలా గార్డెన్‌లో తిరగటానికి వచ్చానని చెప్తే ఆ మాటలు ఎలా నమ్మాడు?

అసలు నమ్మాడా? కేవలం నమ్మినట్లు నటించాడా? తను పారిపోవడానికి కిందకు

వెళ్ళాడని అతనికి తెలీకుండా వుంటుందా? తెలుస్తే ఈ సంగతి సహదేవ్‌కీ, మాధురికీ చెప్పేశాడా? వాళ్ళీ సంఘటననెలా తీసుకుంటారు? తనను తుడిచి పెట్టేస్తారా?

ఇప్పుడు తనను అందుకే తీసుకెళుతున్నాడా?

స్నానం చేసి టవల్ కట్టుకుని గదిలోకి కొచ్చాడు. విష్ణు చేతిలో తన డ్రస్.

తనను వాళ్ళు కిడ్నాప్ చేయకముందు తను తొడుక్కున్న పాంటూ షర్టూ! తనకు తులసి కుట్టించిన బట్టలు-

వాటిని చూస్తూనే నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు.

తను ఈ భవనంలోకొచ్చాక ధరించిన సూట్లకూ, దానికీ ఎంత వ్యత్యాసం? ఎంత హీనంగా వున్నాయవి? అయినా అవే బాగున్నాయి తనకు.

అంతలోనే మరో ఆలోచన రావటంతో వూపిరి స్తంభించి పోయింది. అతను ఇప్పుడు తన బట్టలు, పాత బట్టలు, తన స్వంత ఒరిజినల్ బట్టలు.....ఎందుకు బయటకు తీస్తున్నట్లు? తను వాటిని తొడుక్కోవాలా? అంటే యిక్కడ వుద్యోగం పూర్తయిపోయిందా? తనను ఇవాళే అంతం చేసేస్తారా?

అతను నవ్వాడు క్రూరంగా "కమాన్ సురేష్, ఇవాళ సరికొత్త అవతారం ఎత్తుదువుగాని! నీ ఒరిజినల్ డ్రస్! వేసుకోవాలని నీకు చాలా కోరికగా వుండి వుంటుంది కదూ?"

సురేష్ ముఖంలో నెత్తురు చుక్క లేదు.

నిర్జీవంగా నడిచి అతని చేతిలోని బట్టలు అందుకున్నాడు.

షర్టు వేసుకుంటూంటే కుడి చేతివేపు చాతీ మీద కనిపించినాయి లవ్ అన్న అక్షరాలు . తులసి స్వయంగా కుట్టిందా అక్షరాలు. మరొకప్పుడయితే షర్ట్ వేసుకునే ముందు ఆ అక్షరాల్ని ముద్దు పెట్టుకునే వాడు. అంత అందంగా కుట్టింది.

కానీ ఇప్పుడు - డ్రస్ వేసుకోవటం పూర్తయింది.

"కమాన్ హరియప్, బాస్ వెయిట్ చేస్తూంటారు"

తనకేమీ అర్థం కావటం లేదు. బాస్ అంటే ఎవరు ? సహదేవా? అర్జునా ? అర్జున్ అవటం అసాధ్యం! ఎందుకంటే అతనిని బంధించి వుంచటం తనే కళ్ళతో స్వయంగా చూశాడు. ఖచ్చితంగా సహదేవ్ అయియుండాలి.

కారు వేగంగా వెళ్తోంది ఆఫీస్ వేపు. ఇప్పుడు వెనుకా ముందూ కూడా రెండు కార్లు, సెక్యూరిటీ గార్డ్స్‌తో వస్తున్నాయి. సురేష్ కర్థమయి పోయింది. తననెక్కడో కాల్చి చంపటానికే యింత పెద్ద ఎత్తున జరుగుతోంది వ్యవహారం.

కారు మాధురి ఇండస్ట్రీస్‌లోకి తిరిగింది. మిగతా రెండు కార్లూ గేటు దగ్గర ఆగిపోయాయి. తిన్నగా గారేజ్‌లోకి వచ్చేసింది కారు. ఇది మొదటిసారి...పోర్టికోలో

ఆగకుండా  గారేజ్‌లోకి రావటం!

కారు లోపలకు రాగానే గారేజ్ తలుపు ఆటోమేటిగ్గా మూసుకు పోయింది. అంతా చీకటి!  విష్ణు వేపే జాగ్రత్తగా చూస్తున్నాడు సురేష్ .

అతని చేతిలో సూదిలాటిదేమయినా వుందేమోనని.  తనకెందుకో అనుమానం అలాంటి సూదినే తనకు గుచ్చి పాయిజన్  చేసి చంపుతారని.

విష్ణు కారు దిగి  లైటు స్విచ్ వేశాడు. గారేజ్  అంతా కాంతితో నిండిపోయింది. ఆ కాంతిలోనే ఓ మూలగా కనిపించింది లిఫ్టు.

తనకింతవరకూ తెలీదు...ఇలా రహస్య ప్రదేశంలో మరో లిఫ్టు వుందని . బహుశా అర్జున్ కోసం ప్రత్యేకం అయివుంటుంది. ఇద్దరూ లిఫ్టులో నిలబడ్డారు. తన గదిలోకి అడుగు పెడుతూనే చటుక్కున నిలబడిపోయాడు. ఎదురుగ్గా రివాల్వింగ్ చెయిర్‌లో అర్జున్.

“కమాన్ సురేష్ ...ప్లీజ్ కమిన్”  ఆహ్వానించాడతను.

సురేష్‌కి మతిపోతోంది. ఎలా సాధ్యమిది? తన కళ్ళ తో స్వయంగా చూశాడు

అర్జున్ గొలుసులతో కట్టివేయబడి వుండడం!

ముందుకి నడిచి కుర్చీలో కూర్చున్నాడు అతను.

ఆర్జున్ చిరునవ్వు నవ్వాడు.

“అయాం వెరి హాపీ మిస్టర్ సురేష్, కల్పన  చనిపోయినప్పుడు శ్మశానం దగ్గర - నువ్వు చాలా అద్భుతంగా నటించావు.  టెర్రిఫిక్ టాలెంట్స్ వున్నాయి నీ దగ్గర”

“ఆరు నెలలు మీకు సంతృప్తి కలిగించే విధంగా ప్రవర్తిస్తే నాకు పది లక్షలు యిస్తామన్నారు. అంచేత అది సంపాదించుకుంటానికే ప్రయత్నిస్తున్నాను”.

అర్జున్ లేచి గదిలో పచార్లు చేయసాగాడు.

“తప్పకుండా సంపాదించగలవ్!  నాకేం అనుమానం లేదు. ఇప్పుడు మనం మాట్లాడబోయేది యీ ఆరు నెలల తరువాత విషయం సురేష్”.

అతనికి మళ్ళీ వణుకు పుట్టింది.

తర్వాత ఏమిటి?

“ఇప్పుడు మనం మాట్లాడబోయేది చాలా సీక్రెట్ . ఈ గదిలో మాటలు యీ గదిలోనే వుండిపోవాలి”.

సురేష్‌లో చలనం లేదు. నోరు తెరుచుకొని వింటూండిపోయాడు.

“నీ భవిష్యత్తు కోసం మరో అద్భుతమయిన అవకాశం సురేష్ - అఫ్‌కోర్స్ - ఇందులో బలవంతం ఏమీ లేదు. నీ కిష్టముంటేనే”.